1.50

# వేటుగాడి కొడుకు

## ఇతర విదేశ కథలు

సంపాదకుడు:
హెరాల్డ్ కూర్లెండర్



అనువాదం:
కనకదుర్గా రామచంద్రన్
చిత్రాలు: 'బాపు'

# వేటగాడి కొడుకు

## ఇతర విదేశ కథలు

సంపాదకుడు :

హెరాల్డ్ కూర్లెండర్

అనువాదం :

కనకదుర్గా రామచంద్రన్, ఎమ్. ఏ., ఎమ్. ఇడి.

చిత్రకారుడు : 'బాపు'



పబ్లిషర్సు : అద్దేపల్లి అండు కో

సరస్వతీ పవర్ ప్రెస్

రాజమహేంద్రవరము

# VETAGADI KODUKU

*Selections from*

## ' RIDE WITH THE SUN '

An Anthology of Folk Tales & Stories From the United Nations


*ited by*

HAROLD COURLANDER

For

The United Nations Women's Guild



*Copyright* :

McGRAW-HILL BOOK CO., Inc. New York



*Translator* :

KANAKA DURGA RAMACHANDRAN, M. A., M. Ed.

*Illustrator* :

' BAPU '



First Edition–December, 1958

**Rs. 1–50.**

PUBLISHED UNDER THE AUSPICES OF
THE SOUTHERN LANGUAGES BOOK TRUST

**Publishers : ADDEPALLY & CO**

Saraswathi Power Press

RAJAHMUNDRY.

Printed at the Hindu Press, Masulipatam.

దక్షిణ భాషా పుస్తక సంస్థ సహకారమున ప్రకటించు
పిల్లల పుస్తకములకు
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు
శ్రీ ఎస్. గోవిందరాజులు,
ఎమ్. ఏ., ఎల్ ఎల్. బి., బి. ఎల్., బార్-ఎట్-లా.

# తొలిపలుకు

ఇవి చిన్ని బిడ్డల పుస్తకములు. బిడ్డలు వినోదము గోరుదురు. పెద్దలకు తెలిసిన విషయములెల్ల పిల్లలకు కూడ తెలియవలెను. బిడ్డ లా విషయములను క్రమక్రమముగ నేరువవలెను. ఈ రెండు విధములుగ పుస్తకము లుపయోగ పడును. మంచి పుస్తకముల వలన బిడ్డలకు జ్ఞానము, వినోదము కూడ లభించును.

దక్షిణ భాషా పుస్తక సంస్థ సహకారముతో ఈ పుస్తకములను ప్రచురించుచున్నారు. తమిళము, తెలుగు, మళయాళము, కన్నడ భాషలలో ఈ విధముగ సరసమైన ధరలకు, మంచి పుస్తకములను ప్రకటించుటకు దక్షిణ భాషా పుస్తకసంస్థ తోడ్పడుచున్నది. అమెరికాలో ఫోర్డ్ అను దాత యేర్పర చిన గొప్ప ధర్మ సంస్థ ఇంగులకు ధన సాహాయ్యము చేయుచున్నది. ఫోర్డ్ మహాశయుడు మోటారుకారులు తయారుచేయు వ్యాపారములోను, ఇతర వ్యాపారములలోను విశేషముగ ధనమార్జించి, మహైశ్వర్యవంతుడై, ఆ యైశ్వర్యమున కొంత భాగము ధర్మకార్యముల నిమిత్తమిచ్చివేసెను. ఆ ధన మన్ని దేశముల వారికి నుపయోగపడవలెనని ఆయన సంకల్పము. ఈ దేశ మా దేశ మీ మత మా మతమను భేదము లేకుండ ఈవిధముగ మానవు లందరకు సాహాయ్యము చేయుదలచుట యెంత గొప్ప విషయము!

తిరుపతి,
12—8—1958.

ఎస్. గోవిందరాజులు,
అధ్యక్షుడు,
దక్షిణ భాషా పుస్తక సంస్థ.

# కథల వరుస


| | | |
|---|---|---|
| | | పేజి |
| 1. వేటగాడి కొడుకు—గ్రీస్ కథ | ... | 5 |
| 2. చిట్టెలుక - సున్నపుగొయ్యి—ఇండోనీషియా కథ | | 19 |
| 3. తాబేలు - కోతి—ఫిలిప్పీన్స్ కథ | ... | 25 |
| 4. మూడు వింతప్రశ్నలు—గ్రేట్ బ్రిటన్ కథ | ... | 31 |
| 5. పేదకాపు - గుర్రపురౌతు—కోస్టరీకా కథ | ... | 38 |
| 6. పాము - కలలు—సోవియట్ యూనియన్ కథ | | 45 |
| 7. హాస్యగాడు అబునువాస్—సౌదీఅరేబియా కథ | | 52 |
| 8. నలుగురు యువకులు—బర్మా కథ | ... | 65 |
| 9. ఉప్పు - రొట్టె—స్వీడన్ కథ | ... | 72 |
| 10. బళ్ళోకి వెళ్ళిన ముసలితండ్రి—యుక్రేన్ కథ | ... | 79 |
| 11. పులుసురాయి—బెల్జియం కథ | ... | 86 |
| 12. నాలుగు చిక్కుప్రశ్నలు—పాకిస్థాన్ కథ | ... | 93 |

# 1. వేటగాడి కొడుకు

అనగా అనగా ఒక వేటగాడు. ఆవేటగాడికి ఒక కొడుకు. వేటగాడు తన చివరి రోజులలో, చనిపోయేముందు భార్యని పిలిచి, వేటగానిజీవితం చాలా కష్టమైందనీ, కాబట్టి తనకొడుకు మరే దైనా వృత్తి చేసుకుంటే బాగుంటుందనీ చెప్పాడు. ఆ తరువాత కొన్నాళ్ళకే పాపం వేటగాడు మరణించాడు. వేటగాని కొడుకు క్రమంగా పెరిగి పెద్దవాడయాడు.

ఒకనాడు కొడుకు, "అమ్మా ! మా నాన్న తుపాకీ ఎక్కడుందో చెప్పమ్మా," అని తల్లిని అడిగాడు.

"నాయనా ! నువ్వు వేటగాడివి అవటం మీ తండ్రికి ఏ మాత్రం ఇష్టంలేదు. నువ్వు ఇంకేదైనా వృత్తిచేసుకు బతకాలని ఆయన కోరిక బాబూ !" అంది తల్లి.

"వేట మా తండ్రికి మంచిదైనపుడు నాకుమాత్రం ఎందుకు మంచిది కాదమ్మా ?" అని తల్లితో చెప్పి, తండ్రి తుపాకి చంకను బెట్టుకొని అడవికి బయలుదేరాడు కొడుకు. మంచి జింకను వేటాడాలని అరణ్యమంతా తెగతిరిగాడు. తిరగ్గా తిరగ్గా ఒక మంచిజింక కనపడింది. దాన్ని తుపాకీతో కాల్చి, భుజాన వేసుకొని, పట్నంలో మార్కెట్టుకు తీసుకువచ్చాడు. దాన్ని అమ్ముదామని చూస్తూండగా, రాజుగారి మంత్రి అక్కడికివచ్చి "నీ జింకని ఎంతకిస్తావు?" అని అడిగాడు. వేటగానికొడుకు

"మీ రెంత ఇవ్వదలచుకున్నారు స్వామీ?" అన్నాడు. మంత్రి, "పది పియాస్తర్లు (మన రూపాయిల్లాంటివి) ఇస్తా" నన్నాడు.

"చాలదు. ఆ ఖరీదుకు నేను జింకను అమ్మను" అన్నాడు వేటగాని కొడుకు. మంత్రికి ఆ మాటలకి చాలా కోపం వచ్చింది. "వీడు నే నడిగిన ధరకంటే జింకను హెచ్చు ధర కెట్లా అమ్ముతాడో చూస్తాగా!" అనుకుని వెళ్ళి రాజుగారితో చెప్పాడు. "ప్రభూ! ఈ నగరంలో ఎవడో ఒక జింకనుకొట్టి, బజారులో అమ్మటానికని తెచ్చాడు. అది ఎంతో బాగుంది. మీ లాటి ప్రభువులు భుజించటానికి తగింది. అయితే మీరు దాని ఖరీదు ఒకటిన్నర పియాస్తర్లకంటే ఎక్కువ ఇవ్వకూడదు," అని చెప్పాడు.

రాజు వేటగాని కొడుకును పిలవమన్నాడు. వేటగాని కొడుకు జింకను తీసుకొని రాజుగారిదగ్గరకు వచ్చాడు.

"నీ జింకఖరీదు ఎంతయ్యా?" అని రాజు అడిగాడు.

"ప్రభూ! తమరు చెప్పిందే మాకు న్యాయం. ఏలినవారు చెప్పిన ధరకు ఇచ్చిపోతాను," అని వేటగానికొడుకు చెప్పాడు.

"న్యాయమైన ధర ఒకటిన్నర పియాస్తర్," అన్నాడు రాజు.

రాజుగారిమాటకు ఎవరు ఎదురుచెప్పకూడదు అని వేటగానికొడుకు రాజు ఇచ్చిన ధర తీసుకొని వెళ్ళిపోయాడు.

మరునాడు రాజు మళ్ళీ వేటగాని కొడుకుని పిలిపించాడు. "నాకు పూర్తిగా దంతంతో పెద్ద భవనం కట్టించాలని సరదాగా వుంది. నువ్వు వేటగాడవు కాబట్టి తగినన్ని ఏనుగుల్ని వేటాడి వాటి దంతాలను తెచ్చి, నువ్వే నాకు దంతపు భవనాన్ని కట్టి ఇవ్వాలి," అన్నాడు రాజు.

వేటగానికొడుకు మాట్లాడకుండా నిలబడిపోయాడు. రాజు ఎందుకల్లా మాటాడకుండా నిలబడ్డావని వేటగాని కొడుకుని అడిగాడు.

"ఈ పని చేయగలవా చేయలేవా? ఏదో ఒకటి తేల్చి చెప్పు. చెయ్యలేకపోతే నీకు ఉరిశిక్ష తప్పదు," అని రాజు కచ్చితంగా చెప్పేశాడు.

"సరే ప్రభూ! చేయడానికే ప్రయత్నిస్తాను," అన్నాడు వేటగాని కొడుకు.

పాపం! వేటగాని కొడుకు పెద్ద భవనమంతా కట్టడానికి సరిపోయేటన్ని ఏనుగ దంతాలను ఎల్లా తీసుకు రాగలుగుతానా అని చాలా అధైర్యపడ్డాడు.

ఇంటికివెళ్ళి తల్లితో "అమ్మా! నేను ఈ ప్రపంచంలో ఇక బ్రతికిఉండేది కొద్దిరోజులే. రాజుగారు నేను పెద్ద దంతపు భవనం కట్టడానికి కావలసినన్ని ఏనుగ దంతాలను తీసుకురావాలని ఆజ్ఞాపించారు. ఇంత కష్టమైన, దుస్సాధ్యమైన పని నేను చేయలేను కాబట్టి రాజుగారు నాకు ఉరిశిక్ష వేయక మానరు," అని ఎంతో విచారంగా జరిగిన సంగతంతా చెప్పి, "పోనీ ఒక్క పనిచేస్తా, నాకు కాస్త రొట్టెముక్క మూటకట్టి ఇయ్యి. ఎవరికీ కనపడకుండా నే నెక్కడికైనా పారిపోతాను", అన్నాడు.

"ఇదిగో నాయనా! నామాట విను. మంచి సమయానికి మీతండ్రి ఎప్పుడో చెప్పినమాటలు నాకు జ్ఞాపకం వస్తున్నాయి. ఆ కనబడుతున్న పెద్ద పర్వతంమీద ఒక చెరువు ఉందిట. ఏనుగులు వారానికొకసారి ఆచెరువులో నీళ్ళు త్రాగటానికి మందలు మందలుగా వస్తాయిట. రాజుగారు గనుక నీకు కాస్త సాయం చేస్తే, నువ్వు ఆ ఏనుగుల దంతాలన్నీ తీసుకురావచ్చు. అయితే ఆ

ఏనుగుల్ని వశం చేసుకోటానికి, ఆ చెరువులో నీరంతా తోడించేసి, దాన్ని సారాతో నింపాలి. అప్పుడు ఏనుగులు వచ్చి, నీళ్లను కుని ఆ సారా తాగి మత్తుగా పడిపోతాయి. అప్పుడు వాటి దంతాలన్నీ నువ్వు కోసి తెచ్చుకోవచ్చు. ఈ ఉపాయం నీ తండ్రి నాతో చెప్పారు," అన్నది తల్లి.

ఇదంతా వినగానే వేటగాని కొడుక్కి ఎక్కడలేని సంతోషం వచ్చింది. వెంటనే రాజుదగ్గరికి వెళ్ళి, "ప్రభూ! నేను ఇప్పుడు మీకు కావాల్సినన్ని దంతాలను తెచ్చిఇవ్వటానికి తయారుగా ఉన్నాను. అయితే తమరు ఈ కార్యాన్ని సాధించ టానికి నలభై పీపాల సారా, నేను చెప్పినపని చేసే మనుష్యుల్ని ఇచ్చారంటే, వెంటనే పని ప్రారంభిస్తాను," అని చెప్పాడు.

రాజుగారు నలభై పీపాల సారా, మనుష్యుల్ని వేటగాని కొడుకు అడిగినట్టే ఇచ్చాడు. వేటగాని కొడుకు ఆ సారా పీపాలను వాళ్ళచేత మోయిస్తూ, వాళ్లను తీసుకొని ఆ పర్వతం మీదికి వెళ్లాడు. తల్లి చెప్పిన ప్రకారం, ఆ చెరువులో నీరంతా తోడించేసి దాన్ని సారాతో నింపించాడు. తాను, తన మనుష్యులూ ప్రక్కనున్న అడవిలో చెట్లమీద దాక్కున్నారు. ఏనుగులు మామూలుగా చెరువు దగ్గరికి వచ్చి సారాతాగి మత్తుగా పడిపో యాయి. కొన్ని ఏనుగులు క్రిందపడి నిద్రపోయాయి. మరికొన్ని శక్తిలేక తూలి తూలి పడుతున్నాయి. వెంటనే వేటగానికొడుకూ, అతని మనుష్యులు అడవిలోంచి వచ్చి, ఆ ఏనుగుల దంతాలన్నీ కోసి కట్టలు కట్టి, ఆపైన వాటిని నగరానికి మోసుకుపోయారు. వాటితో రాజుగారి దంతపు భవనం చక్కగా తయారయింది. రాజుగారు సంతోషించారు.

వేటగాని కొడుకు ఇంత పరీక్షపెట్టినా లొంగక, పనిసాధిం చేశాడని మంత్రికిమాత్రం చాలా కోపం వచ్చింది.

ఈసారి ఎట్లాగైనా వేటగాని కొడుకుని బాగా ఏడిపించాలని రాజుదగ్గరకువెళ్ళి, "ప్రభూ! ఉత్తరదిక్కున చాలా దూరంలో పెద్ద కొండ ఉంది. ఆ కొండమీద ఏడుగురు అన్నదమ్ము లున్నారు. వారికి మంచి అందమైన ఒక చెల్లెలు ఉంది. ఆమె మీ దంతపు భవనంలో మీ భార్యగా ఉండదగినది. వేటగాని కొడుకుని పంపండి. ఆ పిల్లని తీసుకువస్తాడు," అని చెప్పాడు.

రాజు ఈ విషయం ఆలోచించాడు. ఆమాట ఆయనకి నచ్చింది. వెంటనే వేటగానికొడుకును పిలిపించాడు. చాలా దూరంలోవున్న ఆ ఉత్తరపర్వతానికి వెళ్ళి, ఆ యేడుగురు అన్నదమ్ముల ముద్దుల చెల్లెలయిన ఆ చక్కని చుక్కను తీసుకు రమ్మని ఆజ్ఞాపించాడు.

యథాప్రకారం వేటగానికొడుకు రొట్టెలమూట బుజాన తగిలించుకొని, విచారంతో మళ్ళీ తిరిగి రాగలనో లేనో అనే దిగులుతో బయలుదేరి పోతున్నాడు. అల్లా చాలాదూరం వెళ్లాక ఒకనాడు ఒక పెద్ద నదిఒడ్డుకి చేరాడు. ఆ నది ఒడ్డున ఎవరో ఒకడు తెరిపిలేకుండా ఆ నీరంతా తాగటం మొదలెట్టాడు. ఎంత నీరు తాగినా, "నాకుదాహం" "నాకుదాహం" అంటూ అరుస్తుం డటం, ఇంకా తాగుతూండటం వేటగానికొడుకు చూశాడు. ఎంత తాగినా వాడిదాహం తీరటంలేదు. "దాహం, దాహం" అంటూ నదిలో ప్రవహించి వస్తున్న నీళ్ళన్నీ గబ గబా తాగేస్తున్నాడు.

"ఏం మనిషివయ్యా! నీకు ఎప్పుడూ దాహమేనా? నీ దాహానికి అంతులేకుండా వుందే?" అన్నాడు వేటగాని కొడుకు.

"అవును, నా కెప్పుడూ దాహమే. నేను ఒంటరిగా తిరుగుతూండటం మూలాన నాకీ బ్రతుకే చిరాకుగా ఉంది. నాతో కూడా తిరిగేందు కెవడైనా మంచి సావాసగాడు దొరికితే, నా కీ

చింతా చీకూ లేకపోను," అని ఆ అతిదాహంగాడు బదులు చెప్పాడు.

"పోనీలే, ఇకనించీ మన మిద్దరం కలిసి తిరుగుదాం. సరేనా?" అని వేటగాని కొడుకు ఆప్యాయంగా అన్నాడు. అప్పటి నించి వాళ్ళిద్దరూ కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ పోతున్నారు.

వాళ్ళిద్దరూ ఉత్తరదిక్కుగానడచిపోతూ, పెద్దమంటముందు కూచుని చలికాచుకుంటున్న మరొకమనిషిని చూశారు. దిట్టంగా మంటమీదికివంగి కూచుని కాచుకుంటూకూడా "నాకు చలేస్తూంది" "నాకు చలేస్తూంది" అని కేకలు పెడుతూండటం వాళ్ల చెవిని పడింది. "అబ్బా! ఈ మంటవేడి నాకు చాలటంలేదు! ఎంత మంట వేసినా, నా చలి తీరటంలేదు. ఇదేం చలి బాబోయ్!" అన్నాడు. వేటగానికొడుకు, ఈ మనిషినికూడా వాళ్ల జతలో కలుపుకున్నాడు. ముగ్గురూ మళ్ళీ ఉత్తరదిక్కుగా బయలుదేరారు.

మరికొంతదూరం పోయాక, వాళ్లకి తిండిపోతు రామయ్య కనపడ్డాడు. తట్టలకొద్దీ అన్నం దిగమ్రింగుతూనే, "నాకు ఆకలి" "నాకు ఆకలి" అని వాడు కేకలు పెడుతూండటంచూసి, వీడుకూడా మనతోకూడా వస్తే బాగుంటుంది, అని వాణ్ణికూడా తమలో కలుపుకున్నారు. నలుగురూ కలిసి మళ్ళీ ప్రయాణం మొదలుపెట్టారు.

పోగా, పోగా, వాళ్ళకి ఇంకొక వింతమనిషి కనిపించాడు. వాడు చెవి భూమికి ఆనించి, ప్రపంచంలో జరిగే విషయాలన్నీ వింటున్నాడు. "భేష్! వీడుకూడా మనజట్టులో ఉండదగిన వాడే!" అనుకొని వాణ్ణికూడా తమ జట్టులో కలుపుకున్నారు. ఐదుగురూ కలిసి మళ్ళీ నడవటం ఆరంభించారు.

నడవగా, నడవగా, మళ్ళీ ఇంకోమనిషి ఎదురయ్యాడు. వాడు పెద్ద గంతులువేసి దూకటంలో చాలా మొనగాడు.

వాడు రెండు చేతుల్లో పెద్ద పెద్ద రాళ్ళు పట్టుకున్నాడు. ఆ రాళ్లను వెనక్కు విసిరిపారేసి అదే సమయంలో తానేమో ముందుకు దూకుతున్నాడు. ఆవిధంగా వాడు నమ్మటానికి వీల్లేనంతదూరం ఒకేసారి దూకుతున్నాడు. "భేష్! వీడుకూడా మన జట్టులో చేర్చుకోతగ్గ వీరుడురా!" అనుకుని, వాణ్ణికూడా వెంటబెట్టుకొని పోయారు. ఇప్పటికి అందరూ కలిసి ఆరుగురయారు.

ప్రయాణం సాగిపోతుండగా మళ్ళీ దారిలో మరొక వింత మనిషి కనిపించాడు. వీడు అందరినీ తలదన్నిన అసాధ్యుడు లాగా ఉన్నాడు. వీడు భూమినే కుదిపివేసి, గర్జింపజేసే శక్తి గల వీరుడు. వేటగాని కొడుకు, వీణ్ణి చూడగానే, ఇంత బ్రహ్మాండమైన శక్తులు గలవాడు వీడు కూడా తన జట్టులో ఉండటం మంచిదని, "రావయ్యా వీరుడా! మాతో రా!" అని అతన్ని కూడా జట్టులో కలుపుకున్నాడు. ఇప్పటికి సరీగా ఏడుగురయారు. ఈ ఏడుగురు స్నేహితులూ కలిసి ఆ ఏడుగురు అన్నదమ్ములున్న ఉత్తరపర్వతం మీదికి చేరుకున్నారు. ఆ ఏడుగురు అన్నదమ్ములు వీళ్లను చూడగానే అమాంతంగా వాళ్లని చంపి పారెయ్యాలని ముందుకు దూకారు. అయితే, ఈ ఏడుగురూ హేమా హేమీల్లాగా కనబడ్డారు. మంచి బలంగా ఉన్న వీళ్ల ఆకారాలు చూసి, ఆ యేడుగురన్నదమ్ములు వెనక్కి తగ్గి మెల్లగా, "మీ రెందుకొచ్చారు ఇక్కడికి? మీకు ఇక్కడ ఏం కావాలి?" అని అడిగారు.

"మేము మీ ముద్దుల చెల్లెలికోసం వచ్చాం. మా రాజుగారు ఆమెను పెళ్ళి చేసుకుంటామన్నారు. రాజుగారు కొత్తగా కట్టించిన దంతపు భవనంలో రాజుగారితో హాయిగా ఉంటుంది. మాతో పంపండి," అన్నాడు వేటగాని కొడుకు.

ఏడుగురు అన్నదమ్ములు ఇంటికివెళ్ళి బాగా ఆలోచించి ఒక పన్నాగం పన్నారు. వేటగాని కొడుకు, "వారేమి అనుకుంటున్నారో కనిపెట్టగలవా ?" అన్నాడు, భూమికి చెవి ఆనించి ప్రపంచంలో సంగతులన్నీ విని తెలుసుకోగలవాడితో. వాడు వెంటనే భూమికి చెవి ఆనించి ఏడుగురు అన్నదమ్ములు మాట్లాడుకుంటున్న మాటలన్నీ విన్నాడు.

"వాళ్లు మనకు ఏడు పెద్ద గంగాళాల నిండా భోజనం పెడతారట. అదంతా మనం తినగలిగితేనే, వాళ్ల చెల్లెల్ని మనతో పంపుతారుట. లేకపోతే పంపరుట," అని చెప్పాడు.

"అంత ఎల్లా తినగలం ? ఏం చేద్దాం ?" అని అడిగాడు వేటగాని కొడుకు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు ? నేనున్నాగా! నా అంతులేని ఆకలిమాట మరచిపోయావా ? ఏడు గంగాళాల తిండీ నేనే నిమిషంలో ఊది పారేస్తాను. సరేనా !" అన్నాడు ఎంత తిన్నా ఆకలి తీరని తిండిపోతు. ఏడుగురు అన్నదమ్ములు ఆ ఏడుగురి స్నేహితుల్ని ఇంటికి పిలుచుకుపోయి వారి ముందు ఏడు గంగాళాలనిండా భోజనం పెట్టారు. మిగిలిన ఆరుగురు అట్టే తినలేకపోయారు. తిండిపోతు రాముడు మాత్రం ఆ గంగాళాల మీద పడి అమాంతంగా తినేస్తున్నాడు. ఒక్కొక్క గంగాళమే ఖాళీచేసి అవతలికి తోసేస్తూ, చూస్తూండగానే ఆ యేడుగంగాళాలలో ఉన్న భోజనం, పిండివంటలూ అన్నీ తినేశాడు. అయినా, వాళ్లకి తమ చెల్లెలి నిచ్చి పంపటం ఇష్టంలేక, ఇంకా అనేక చిక్కు పరీక్షలు పెట్టాలనుకున్నారు, ఆ ఏడుగురు అన్నదమ్ములు.

ఏడు పీపాల నిండా నీళ్లు తెచ్చి ఆనీళ్లన్నీ తాగాలన్నారు. అందులో ఎన్ని నీళ్లు తాగినా దాహంతీరని అతి దాహంగాడు ఆ యేడు పీపాల నీళ్లు గట గట తాగి పైగా ఇంకా "దాహం దాహం"

అని అరవటం మొదలుపెట్టాడు. ఏడుగురు అన్నదమ్ములు ఆశ్చర్యపడి, మళ్ళీ వాళ్లకి ఇంకో పరీక్ష పెట్టారు.

"మీలో ఎవ్వరైనా ఒక్కరు సలసల మండిపోయే మా ఆవిరిస్నానం గదిలో కొంతసేపు ఉండగలిగితేనే మా చెల్లెలిని మీతో పంపుతా" మన్నారు. రాత్రింబవళ్లు "చలి చలి" అని గోల బెట్టేవాడు సంతోషంగా, "అయ్యా నేను మీ ఆవిరిస్నానం చేస్తాను," అన్నాడు.

వాణ్ణి ఆ ఆవిరి గదిలోపెట్టి, మనిషి చచ్చిపోయేంత వేడి ఎక్కించేశారు. అయినా వాడు హాయిగా ఆ గదిలోనే కూచున్నాడు. ఏడుగురు అన్నదమ్ములు గదిబయట ఉండి చూస్తున్నారు. ఎంత సేపటికీ స్నానపుగదిలో సడి, చప్పుడు లేకపోవటం చూసి, ఈ సరికి వాడు చచ్చిపోయే ఉంటా డనుకుంటూ తలుపు తీశారు.

"తలుపు వేయండయ్యా! నేను చలితో చస్తూంటే ఏమిటల్లా చూస్తున్నారు? నేను బాగానే వున్నా. మీకు పుణ్యముంటుంది! చలిగాలి వచ్చేస్తూంది. తలుపు వేసెయ్యండి!" అని అరిచాడు వాడు. అంత వేడిలో కూడా, వాడు ఎప్పటిలాగే దుడ్డుముక్కలాగా ఉండటం చూసి, ఆ ఏడుగు రన్నదమ్ములూ ఆశ్చర్య పడ్డారు.

"ఓహో! మీ రందరూ బలే అసాధ్యుల్లాగున్నారే! మేము ఏ పని చేయ మంటే అది ఇట్టే చేసేస్తున్నారు! అయితే మీరు చెయ్యవలసిన పని ఇంకొక టుంది. ఇది కూడా మీరు సరిగా చెయ్యగలిగితేనే, మా చెల్లెల్ని మీతో పంపుతాము. ఆ ప్రక్కనున్న కొండమీద, ఒక మంచినీటి చెలమ ఉంది. మీలో ఒకళ్లు పోయి అక్కణ్ణించి నీళ్లు తేవాలి. మా చెల్లెలుకూడా వచ్చి, అక్కణ్ణించి నీళ్లు తీసుకొస్తుంది. ఆమె కంటె ముందుగా

మీరు నీళ్లు తే గలిగితేనే మా చెల్లెలిని పంపుతాం. మా చెల్లెలే ముందుగా నీళ్లు తీసుకువస్తే పంపమన్నమాట," అని ఆ ఏడుగు రన్నదమ్ములు చెప్పారు.

ఎంత దూరమైనా ఇట్టే దూకగలవాడు రెండు బరువైన రాళ్ళను తన రెండు చేతుల్లో పట్టుకుని వెనక్కి విసరేస్తూ, తాను ముందుకు దూకాడు. ఆ ఊపుకి ఒక్క గంతులో అవతల కొండ మీదికి దూకేశాడు. త్వరగా తన సీసానిండా నీరు నింపు కొని నిదానంగా నడచి వస్తున్నాడు. దోవలో ఆ అందాల రాణి అతనికి ఎదురు పడింది. అప్పుడే ఆమె కొండమీదికి వెళుతూంది.

"చూశావమ్మా? మే మే జయించేశాంగదా! రా! కాసేపు ఇక్కడ కూచుని పిచ్చాపాటీ మాట్లాడుకుందాం," అన్నాడు ఆ దూకుడు మొనగాడు. అక్కడకూచుని మాట్లాడుతూండగా, వాడికి కాస్త కునుకు పట్టింది. ఇదే సమయం అనుకొని, ఆ పిల్ల అతని సీసాలోని నీరంతా తన సీసాలో పోసేసుకుని చర చరా ఇంటిదారి బట్టింది.

దుముకుడుగా డింకా రాలేదేమా అని వేటగాని కొడుకు, ఆలోచిస్తున్నాడు. చెవి నేల నాన్చి అన్ని విషయాలు వినగలిగే వాడు వెంటనే తన చెవి భూమికి ఆనించి విన్నాడు. "అరెరే, మనం ఓడిపోయినట్టే! ఆ బండాభాయి గుర్రుపెట్టి నిద్రపోతు న్నాడు, ఆ అమ్మాయి అతని సీసాలో నీరు తీసుకొని ఇంటికి తిరిగి వచ్చేస్తూంది," అని చెప్పాడు.

"మరేం కొంపమునిగి పోలేదు లేవయ్యా! నే నున్నాగా, క్షణంలో వాడి నిద్రా గిద్రా ఎగిరిపోయేట్టు చేస్తా చూడు!" అని భూమిని కుదిలించి, గర్జింపజేసే శక్తి గల వీరుడు ధైర్యం చెప్పాడు. అంటూనే వాడు ఒక చిన్న భూకంపం పుట్టించాడు. దూకుల మొనగాడు ఉలిక్కిపడి లేచి, తన సీసాలో నీళ్ళు వంపు

కుని పారిపోతున్న అమ్మాయి దగ్గరకు ఒక్కగంతులో వచ్చి ఆ సీసాలో నీళ్లు తీసుకుని, ఇంకొక్క గంతులో తనతోటివాళ్ళంతా ఉన్నచోటికి వచ్చి పడ్డాడు.

ఏడుగు రన్నదమ్ములూ ఇచ్చిన పరీక్ష లన్నిటిలో వాళ్లు నెగ్గారు. ఏడుగు రన్నదమ్ముల నక్కజిత్తు లేమీ పనిచెయ్యలేక పోయాయి. చివరికి వేటగాడి కొడిక్కి ఆ అందాల భరిణెని అప్ప జెప్పారు. వేటగాని కొడుకు, అతని స్నేహితులు సంతోషంగా వచ్చి, రాజు వద్దకు చేరుకున్నారు.

రాజు ఈ సుందరాంగిని చూడగానే అమితానంద భరితు డయ్యాడు. మంత్రికిమాత్రం వేటగాని కొడుకు ఎంతపనైనా తేలికగా సాధించుకొస్తున్నందుకు తగని కోపం వచ్చింది.

ఆ చక్కనిచుక్క రాజువైపు చూసింది. మంత్రివైపు చూసింది. మరొకమారు ఆ అందమైన దంతపు భవనంవైపు చూసింది.

"దివ్యమైన ఈ దంతపు భవనానికి కావలసిన దంతాలన్నీ తెచ్చి ఇచ్చిం దెవరు ?" అని అడిగింది.

"వేటగాని కొడుకే," అన్నాడు రాజు.

"ఈ దంతపు భవనం కట్టిందెవరు ?" అంది. "వేటగాని కొడుకే," అన్నాడు రాజు.

"అంత దూరప్రయాణంచేసి ఉత్తరపర్వతంనించి నన్ను తీసుకొచ్చింది ఎవరు ?" అని మళ్లీ అడిగింది.

"అదీ వేటగానికొడుకు సాధించినపనే" అన్నాడు రాజు.

"ఇన్ని ఘనకార్యాలు సాధించినవాడు వేటగాని కొడుకైతే నేను నిన్నెందుకు పెళ్ళాడాలి?" అని రాజును ప్రశ్నించింది.

దుష్టుడైన ఆ మంత్రి ఎలుకగా మారాలని, రాజు పిల్లిగా మారాలనీ, ఆ పిల్లి ఎలుకను తరుముకుపోవాలనీ ఆ చక్కని చుక్క శపించింది. వెంటనే మంత్రి ఎలుక అయిపోయాడు. రాజు పిల్లిగా మారి ఎలుకను తరమడం ప్రారంభించాడు.

ప్రజలందరూ కలిసి వేటగాని కొడుకుని తమ కొత్త రాజుగా ఎన్నుకున్నారు. వేటగానికొడుకు ఆ చక్కనిచుక్కని పెళ్ళిచేసుకున్నాడు. వాళ్ళిద్దరూ ఆ దివ్యమైన దంతపు భవనంలో సుఖంగా ఉంటున్నారు.

---

కొ త్త క థ

---




వేటగాడి కొడుకు



చిట్టెలుక - సున్నపుగొయ్య

## 2. చిట్టెలుక — సున్నపు గొయ్యి

ఒక నాడు 'కాంట్చెల్' అనే అమెరికా దేశపు చిట్టెలుక ఒక కాపువాని యింటి పక్కగా నడచిపోతూంది. నడుస్తూ నడుస్తూ, మెల్లగా ఆ ఇంటి తలుపు సందులోంచి తొంగి చూసింది. అరటి ఆకు పొట్లంలో, అరటిపండ్లతో తయారు చేసిన తియ్యని అప్పచ్చి ఒకటి దాని కంట బడింది. కాపూ, కాపు భార్యా ఇంట్లో లేరని కనిపెట్టింది. వాళ్ళిద్దరూ వరిపొలాల్లో పనికి వెళ్లారు. ఇదే సమయమని ఆ చిట్టెలుక ధైర్యంగా ఇంట్లో దూరింది. తియ్యని అప్పచ్చిని చూసేటప్పటికి ఆ చిట్టెలుక నోరూరింది. చటుక్కున అప్పచ్చిపొట్లం నోట కరచుకుని పెరటి లోకి పారి పోయింది. పోతూ పోతూ, అరటి ఆకు మెల్లగా విడదీసి అప్పచ్చి కొద్దికొద్దిగా, కొరుక్కుని తింటూ నడుస్తూంది. తిండి ధ్యాసలో అరటి ఆకు అడ్డం వచ్చి కండ్లు కనిపించక పోవటం చేత, నడుస్తూ నడుస్తూ ఆ చిట్టెలుక కాపువాని పెరటిలోఉన్న సున్నపు గోతిలో పడిపోయింది.

లోతుగా ఉన్న సున్నపుగొయ్యిలో తను పడ్డందుకు ఆ చిట్టెలుక్కి విచారంతోపాటు చాలా ఆశ్చర్యం కూడా కలిగింది. తను బాగా, చురుకుగా ఎగర గలదు. అయినా అంత లోతు గొయ్యిలోంచి పైకి ఎగరలేక పోయింది. ఎట్లాగా అని ఆలోచిస్తూంది. నోట్లో అరటి ఆకు మాత్రం అట్లాగే ఉంది.

ఏంచెయ్యడానికీ తోచక, చిట్టెలుక 'తూహాన్', 'తూహాన్' అని అరిచింది. (ఇండోనీషియా భాషలో 'తూహన్' అంటే దేవు డన్న మాట.) ఇంతలోకే అక్కడికి "బాబీ" అనే అడవి పంది వచ్చింది.

"ఎవరా గోతిలో దిగి దేవునిపేరు స్మరిస్తున్నారు?" అని గొయ్యి అంచున నిలబడి బాబీ అడిగింది.

చిట్టెలుక అరటి ఆకును పుస్తకంలాగ పట్టుకొని అందులో చూచి చదివి పారేస్తూంది. "విను, బాగా విను. 'తూహాన్' దైవం ఏమంటున్నాడో! ఇవ్వాళ ప్రళయ దినం, ప్రాణం కాపాడుకోవాలని కోరుకునే వాళ్లు ఈ పవిత్ర గృహంలో ఆశ్రయం పొందవచ్చు," అని చిట్టెలుక చదివింది.

"నీకు ఎవరు చెప్పారే ఇవ్వాళ ప్రళయ దినమని?" అని బాబీ అడిగింది.

"ఈ పవిత్రగ్రంథంలో స్పష్టంగా వ్రాసిఉన్న విషయం ఇంకా ఒకళ్లు చెప్పే దేమిటి? ఫలానా రోజున, - అంటే ఈ రోజునే- ఈ ప్రపంచం ప్రళయంలో మునిగిపోతుంది. ఈ పవిత్ర మైన సున్నపు గొయ్యిలోకి వచ్చి నిలబడిన వాళ్లే బ్రతుకుతారు," అని చిట్టెలుక గట్టిగా అరిచింది.

"నువ్వు చెప్పేదంతా నిజమే నంటావా?" అని బాబీ మళ్ళీ అడిగింది.

"ఇదేమిటి? నువ్వు సృష్టి కర్త యైన తూహన్‌నే తల్ల క్రిందులు చేస్తావేమిటి? బాగుందిలే నీ సంగతి! అబ్బా! ఎంత గడిసరివై పోయావు?" అంది చిట్టెలుక. ఈ కరుకు మాటలు వినగానే బాబీ తడ బడి పోయి, చిట్టెలుకతో, "అయితే నేనూ ఈ పవిత్రమైన సున్నపు గొయ్యిలోకి వచ్చేస్తాను. రానిస్తావా?" అంది బాబీ.

"అయ్యో! నన్నేం చేయమంటావు? పరిశుభ్రంగా వుండే వాళ్లే ఈ గొయ్యిలోకి రావాలి. మురికి వాళ్లు రాకూడదు. తెలిసిందా?" అంది 'కాంట్చెల్' చిట్టెలుక.

"నేను శుభ్రంగానే వున్నాగా? ఇంకా చూడు కావాలంటే," అంది బాబీ."

"అబ్బే; ఎప్పుడు చూసినా, నువ్వూ నీ తుమ్ములూ తయారాయి! నాకు తెలియదేమిటి నీ తుమ్ముల గోల! ఈ పవిత్ర స్థలంలో ఎవ్వరైనా సరే, తుమ్మటానికి వీల్లేదు," అంది చిట్టెలుక.

"ఇదిగో! నా మాట కాస్త విను. ఇంక నేను తుమ్మనే తుమ్మ నని ప్రమాణంచేసి చెబుతున్నా, సరేనా?" అంది బాబీ.

'కాంట్చెల్' చిట్టెలుక, అరటిఆకు మళ్ళీ పుస్తకం లాగా పట్టుకొని గొప్పగా చదవటం మొదలుపెట్టింది. "ఈ పవిత్ర స్థలంలో ఎవరైనా తుమ్మితే, వారిని వెంటనే బయటికి తోసి వెయ్యాలి," అని తూహాన్ ఆజ్ఞ. "ఇప్పుడైనా నీకు తెలిసిందా?" అని చిట్టెలుక బాబీ తో గంభీరంగా పల్కింది.

"అబ్బా! ఎన్ని సార్లు చెప్ప మంటావు? నేను ఒక్క తుమ్ము కూడా తుమ్మను. నా మాట నమ్ము. ఇదిగో నీ దగ్గరకు వచ్చేస్తున్నా ఇప్పుడే," అని బాబీకూడా సన్నపు గొయ్యిలోకి దూకింది.

చిట్టెలుక యథాప్రకారం చదవటం ప్రారంభించింది. అదే సమయానికి 'మట్ జన్' అనే పులి గొయ్యిదగ్గరకు వచ్చింది.

'మట్ జన్' కూడా అడవిపంది బాబీలాగే "ఎవరక్కడ, 'తూహాన్' దేవునిపేరు స్మరిస్తున్నారు?" అని అడిగింది.

"ఇవ్వాళ కల్పాంతదినమని నీకు తెలియదూ?" అని 'బాబీ' మట్ జన్‌పులిని అడిగింది.

"మన చిట్టెలుక 'కాంట్బెల్' పవిత్రగ్రంథం చదువుతూంటే నీకు వినబడటంలేదూ?" అంది బాబీ.

"అది సరేకాని, మీరిద్దరూ ఆ గోతిలో ఎందుకు దాక్కుంటున్నారో నాకుకూడా కాస్త చెప్పండి," అని అడిగింది పులి.

"పవిత్రమైన ఈ గోతిలో ఉన్నవాళ్ళు మాత్రమే, ఈవేళ ప్రళయంలో నశించిపోకుండా బ్రతికి వుంటారు," అని ఆ అరిటాకు పుస్తకంలోంచి చిట్టెలుక మళ్ళీ చదివింది.

"అందుకనే మేమిద్దరం ఈ పవిత్రమైన సున్నపు గొయ్యిలోకి వచ్చాం. తెలిసిందా?" అంది బాబీపంది.

"ఓహో! అలాగా! అయితే నేనూ మీ దగ్గిరికి వచ్చేస్తాను," అంది పులి.

చిట్టెలుక తనతో తుమ్మకూడదని చెప్పినమాటలన్నీ బాబీపంది పులితో చెప్పింది. "కాని నువ్వు ఈ పవిత్రస్థలాన్ని నీ తుమ్ములతో అపవిత్రం చేయటానికి వీలులేదు. తెలిసిందా?" అని గట్టిగా చెప్పేసింది.

మట్ జన్ పులి తుమ్మనని ఎట్లాగో వాళ్ళిద్దరికీ నచ్చచెప్పి, ప్రాణం కాపాడుకుంటంకోసం తనుకూడా ఆ గొయ్యిలోకిదూకింది.

చిట్టెలుక మళ్ళీ చదవటం ప్రారంభించింది. ఈసారి 'కట్ జా' అనే యేనుగు గొయ్యిలోకి తొంగి చూసింది.

"తూహాన్‌దేవత పవిత్రమైన పలుకులు చదువుతున్నారెవరక్కడ?" అని అడిగింది.

'మట్ జన్' పులి, 'బాబీ' పంది కూడా ఒకేసారి, "ఇవ్వాళ ప్రళయం రాబోతూంది. ఈ పవిత్రమైన గోతిలో ఉన్నవాళ్ళు మాత్రమే ఈప్రళయాన్ని తప్పించుకొని బ్రతుకుతారు," అని చెప్పాయి.

"అలాగా ? అయితే నేనూ మీతోపాటు ఆ గొయ్యిలోకి వచ్చేస్తాను," అంది ఏనుగ.

"అమ్మయ్యో! నువ్వువద్దు బాబు. నువ్వు మాదగ్గరకు రావద్దు ! నీ పర్వతాకారం, బ్రహ్మాండమైన తుమ్ములూ ఇక్కడ పనికిరావు. పైగా నువ్వు ఎంతో గట్టిగా తుమ్ముతావు. చిన్నతుమ్ముకే ఈ పవిత్రస్థలం మైలబడిపోతుంది. ఇంక నీ భయంకరమైన పెద్ద తుమ్ము సంగతి చెప్పాలా? నువ్వుమాత్రం మాదగ్గరకు రావద్దబ్బా!" అన్నారు.

"నేనేమీ తుమ్మమలెండి. భయపడకండి," అంటూ ఆ యేనుగకూడా సున్నపుగొయ్యిలోకి దిగింది. అందరూ సున్నపు గొయ్యిలో గుంపుగా కూర్చున్నాక, చిట్టెలుక మళ్ళీ ఆ అరటిఆకుని పుస్తకంలాగా పట్టుకుని చదివి, కట్‌జా ఏనుగునిచూస్తూ, "నువ్వు ముందు బయటికి నడు. నీ ముఖవాలకం చూస్తే నీకు ఇప్పుడే తుమ్ము వచ్చేటట్టుంది," అంది

"నాకేమీ తుమ్ము రావటంలేదు. చూడు కావాలంటే. ఇప్పుడు నేను నా తొండంమీద నిలబడతాను. అంటూ తొండం మీద అమాంతంగా లేచి నిలబడింది ఏనుగ.

చిట్టెలుకకి అరటిఆకు పుస్తకంచూచి చదవటం తప్ప మరోపని కనబడటంలేదు.

"అదిగో ఏమిటా శబ్దం ? ఎవరైనా తుమ్మారా ? అంది చిట్టెలుక పులికేసి చూసి.

"నీకేం చాదస్తం! నేనేమీ తుమ్మలేదు. కాస్త గట్టిగా ఊపిరి విడిచాను అంతే. దీనికేనా ఇంత గడబిడ చేస్తున్నావు?" అంది పులి.

చివరికి చిట్టెలుకకే కళ్ళు తేలిపోతున్నాయి. తుమ్ము ఎక్కడ వచ్చేస్తుందో అనే భయంతో ముక్కు గట్టిగా పట్టేసు కుంది. ఎంతముక్కుపట్టుకున్నా తుమ్ము రాకుండా తప్పిందికాదు.

"అట్ఛి" !!!! అని తుమ్మేసింది చిట్టెలుక. ఇంకేముంది! కొంప మునిగిపోయిం దన్నమాటే!

సున్నపుగొయ్యిలో చేరిన తక్కిన జంతువులన్నీ చిట్టెలుక తుమ్మి, ఆ పవిత్రస్థలాన్ని అపవిత్రంచేసి పారేసిందని ఒక్క పెట్టున గగ్గోలు పెట్టేశాయి.

'తుహాన్' దేవుని ఆజ్ఞను చిట్టెలుక అతిక్రమించిందని కోపం వచ్చి, అన్నీ కలిసి ఆవేశంతో ఆ చిట్టెలుకను పట్టు కొని సున్నపు గొయ్యిలోంచి విసిరి బయట పారేశాయి.

'కాంట్చిల్' చిట్టెలుక ఆ సున్నపు గోతిలోంచి బయటపడి బ్రతుకుజీవుడా! అనుకుంటూ, నవ్వుకుంటూ పారిపోయింది.

ఇండోనీషియా

# 3. తాబేలు — కోతి

అనగా అనగా ఒక తాబేలు. ఆ తాబేలు ఒక నదిఒడ్డున ఎండలో చలి కాచుకుంటూ పచార్లు చేస్తూంది. ఇంతలో నదిలో ఏదో తేలుతూ కొట్టు కొస్తూంది. తాబేలు చూసింది. అది కొంచెం దగ్గరకు రాగానే అరటి చెట్టని గ్రహించింది. వెంటనే తాబేలు నీళ్ళల్లో దూకి ఈదుకుంటూ పోయి, ఆ అరటిచెట్టును పట్టుకొని ఎట్లాగైతేనేం ఒడ్డుకు లాగింది. కాని, పూర్తిగా గట్టుమీదికి లాగలేక పోయింది. వెంటనే వెళ్ళి ఒక కోతిని పిలుచుకొచ్చింది. తనకు దొరికిన తాయిలాన్ని దానికి చూపించింది. "ఇదిగో, ఈ అరటిచెట్టు చుశావా ? నదిలో కొట్టుకుపోతూంటే నేను తెచ్చుకున్నాను. దీన్ని నా తోటలోకి తీసుకుపోవటానికి కాస్త సాయం చెయ్యి. నేను దీన్ని అక్కడ పాతిపెట్టి పెంచుకుంటాను," అని కోతిని బతిమాలింది.

కోతి మాత్రం సామాన్యమైందా ? "ఇంతా చేస్తే నాకేం లాభం?" అను కుంది.

"మరి నేను నీ కీ సాయం చేస్తే, నాక్కూడా అందులో భాగం ఇస్తావా ?" అంది.

"అల్లాగే ! నువ్వీ సాయం చేస్తే తప్పకుండా నీకూ భాగం ఇస్తాను," అంది తాబేలు. తాబేలు, కోతి ఇద్దరూ కలిసి అరటి చెట్టును తాబేలు తోటలోకి ఎట్లాగో లాక్కెళ్ళి పడేశారు.

"ఇప్పు డిక పాదు తవ్వి, ఈ అరటి చెట్టును పాతి పెడదాం," అంది తాబేలు. "అదేమిటి ? మనమిద్దరం పంచు కుందాం అనుకున్నాంగా ?" అన్నది కోతి ఆదుర్దాగా. "నిజమే ! పంచుకుందాం. తొందర పడతావేం ? మొట్ట మొదట ఈ చెట్టు పాతిపెడదాం. ఈ చెట్టు కాయలుకాసి పళ్లు పండాక ఆ పళ్లు చెరిసగం పంచుకుందాం. సరేనా ?" అన్నది తాబేలు తాపీగా.

కోతికి కోపంవచ్చేసింది. "నాకు భాగం ఇస్తానని ఇదేనా నువ్వు చేసే పని ? బాగుందిలే. నేను ఒప్పుకోను. ముందు నా భాగం నాకు పంచిపెట్టి మరీ మాట్లాడు. న్యాయంగా నీ సగం చెట్టు నువ్వు తీసుకో. నా సగం చెట్టు వే తీసుకుంటా," అన్నది కోతి.

"ఇదేనా భాగాలు పంచుకునే లక్షణం ! ఇదేం నాకు బాగా లేదు," అని సమాధానం చెప్పింది తాబేలు.

"నా కదంతా తెలియదు. నా భాగం ముందు నాకు ఇచ్చి మరీ మాట్లాడు," అంది కోతి. తాబేలు ఇష్టం లేకపోయినా అరటి చెట్టుని రెండు భాగాలుగా మధ్యకి కోసింది. కోతి అరటి చెట్టు పైభాగం, చక్కగా పచ్చని ఆకులతో కల, కల లాడు తుండటం చూసి, "ఆ పై భాగం అంతా నాది," అంది. ఆ పచ్చని ఆకులున్న భాగం తీసికెళ్ళి కోతి తన తోటలో పాతిపెట్టు కుంది. తాబేలు తన భాగం పాతిపెట్టి, చుట్టూ మట్టితో బాగా దిట్టం చేసింది. కొన్నాళకి, పాపం ! కోతి ఆశగా తీసుకువెళ్ళిన పై భాగం ఆ పచ్చని ఆకులన్నీ ఎండిపోయి, చచ్చిపోయింది.

అయితే తాబేలు భాగంలో దుంప, వేళ్లు కూడా ఉన్నా యిగా. అందుచేత చక్కగా పెరిగి, ఆకులు, పూవులు వేసింది. తర్వాత పెద్ద గెల వేసింది. ఇంకా కొన్నాళ్ళకి మంచి అరటిపళ్లు

పండాయి. అయితే యేం! పాపం! తాబేలు చెట్టెక్కి ఆ అరటి పళ్లు కోసుకోలేదు గద. మళ్ళీ కోతిని బ్రతిమాలు కోవలసి వచ్చింది.

"నువ్వు కొస్త ఆ చెట్టుపై కెక్కి అరటిపళ్లు కోసి క్రింద పడెయ్. నేను నీ కష్టం వుంచుకోకుండా కొన్ని అరటి పళ్లు నీకూ ఇస్తాను," అంది తాబేలు.

కోతి సంతోషంగా వెళ్ళి అరటిచెట్టుపైకి ఎక్కి కూచుని అరటిపళ్లు ఒక్కొక్కటే ఒలుచుకు తినటం మొదలుపెట్టింది. తాబేలు ఓపికతో అరటిపళ్ళ కోసం ఎంతో సేపు ఎదురు చూసింది. ఎంత సేపటికి కోతి పళ్లన్నీ తను తినటమే కాని, తాబేలు సంగతే ఆలోచించటం లేదు.

ఒక్క పండైనా తాబేలుకు పడెయ్యలేదు. తాబేలు చివరకి దీనంగా, "నాకుకూడా కొన్ని పళ్లు ఇట్లా కింద పడెయ్యి. నేను పట్టుకుంటాను," అని బతిమాలుకున్నట్టు అడిగింది కోతిని.

"నే పడెయ్యను. నాకు నువ్వు అరటిచెట్టులో పనికిరాని భాగం ఇచ్చినన్ను మోసంచేశావు. అంచేత ఇప్పుడు నేనే అన్ని పళ్ళూ తింటూన్నా," అంది కోతి.

తాబేలు పాపం "నాకుకూడా కాసిని ఇవ్వవూ?" అని జాలిగా మళ్ళీ అడిగింది. కొంటెకోతి పళ్ళు తను ఒలుచుకొని తింటూ తోళ్ళుమాత్రం తాబేలు ముఖాన పడేసింది. తాబేలుకి బాగా కోపం వచ్చేసింది. కసితో గబ గబా వెళ్ళి ఇన్ని ముళ్లపొదలు లాక్కొచ్చి ఆ చెట్టుచుట్టూ పరిచేసింది. పళ్లు హాయిగా తిన్నాక కోతి గభాలున కిందికి దూకింది. సరిగా ముళ్లలో పడింది. ఒళ్లంతా ముళ్లు గుచ్చుకొని, ఆబాధకు ఓర్వలేక కిచకిచమంటూ గంతులు పెడుతూ కేకలేసింది. ఆ కోతిగంతు చూసి తాబేలు నవ్వు ఆపుకోలేకపోయింది. పకపకా నవ్వేసింది. ఆ నవ్వు

వినగానే కోతికి మండుకొచ్చింది. ఒక్క పట్టున ఎగిరి ముందుకు దూకి, తాబేలును పట్టుకొని వెల్లకిలా పడేసింది. తాబేలు పాపం! గిలగిలా కొట్టుకుంటూంది.

"నువ్వు చేసిన నేరాలకు నీకు తగినశాస్తి చేస్తాలే. నిన్ను కట్టెతో చావగొడదామా, తిరగలిలోవేసి త్రిప్పుదామా, లేకపోతే కొండమీంచి కిందికి దొర్లిద్దామా అని ఆలోచిస్తున్నాను," అని కోతి ఇంకా ఇలాంటివెన్నో ఉపాయాలు ఆలోచిస్తూంది. చివరకు తాబేలు, "నువ్వు ఏం చేసినాసరే! కొండనుంచి కిందికి పడేసినా సరే; తిరగలిలోవేసి పిండిచేసినాసరే; కట్టెలతో కొట్టినాసరే. ఏం చేసినా చెయ్యిగాని నీళ్ళలోమాత్రం నన్ను పారెయ్యకు. నీకు పుణ్యం ఉంటుంది," అంది. ఇది విని కోతి సంతోషపడింది.

"అయ్యో! ఎంత వెఱ్ఱిదాన్ని. నీళ్ళల్లో పారెయ్యొచ్చన్న సంగతి అసలు మరచేపోయాను. ఉండు. ఉండు. నీళ్ళల్లో పారేసే నీ ప్రాణం కాస్తా తీస్తానుండు!" అంది.

కోతి తాబేల్ని తీసుకుపోయి, నదిలో బాగా లోతుగా ఉన్నచోటు చూసి గభాలున విసిరి పారేసింది. నిమిషంలో తాబేలు కంటికి కనబడకుండా నీటిలో మాయమైపోయింది. నీళ్ళుమాత్రం తాబేలుపడ్డ వేగానికి పైకి చిందాయి.

"మంచి శాస్తి చేశాను," అనుకుంటూ కోతి ఎంతో ఉబ్బిపోయింది. తాబేలుకి తగినశాస్తి అయిందని అంతులేని ఆనందంతో గంతులేస్తూంది. ఇంతలో తాబేలు మళ్ళీ నీళ్ళపైకివచ్చి, తల పైకెత్తి కోతితో ఇట్లా అంది.

"స్నేహితుడా! ఎంత మంచివాడివి! నాకు మంచి ఉపకారం చేశావు. ఏం చేస్తావు పాపం! నే నుండేదే నీళ్ళలో అని తెలుసుకోలేకపోయావు," అని నవ్వింది.

ఫిలిప్పీన్స్



తాబేలు - కోతి




మూడు వింత ప్రశ్నలు

# 4. మూడు వింత ప్రశ్నలు

ఇంగ్లాండు దేశపు మహారాజు, జాన్ క్రూరుడు. అసూయా పరుడు కూడాను. తన రాజ్యంలో తన కంటే భాగ్యవంతుడు గాని, పలుకుబడి గలవాడు గాని ఉండటం ఆయనకు ఏ మాత్రం ఇష్టం లేదు. నిజానికి ఆ దేశంలో అందరికన్న ఐశ్వర్యవంతుడు, అధికారం గలవాడూ ఆయనే. అందువల్ల ఆయన అసూయ పడతగిన వాడంటూ ఆ దేశంలో లేనే లేడు. ఆ మహారాజు తను ఆడింది ఆటగా, పాడింది పాటగా అధికారం చెలా ఇంచేస్తున్నాడు. తన అధికారాన్ని ఎవరైనా ఏమాత్రం ధిక్కరించినా వాళ్లని కొంచమైనా జాలినాలిలేకుండా కఠినంగా శిక్షిస్తున్నాడు.

ఒకనాడు జాన్ మహారాజు - కాంటర్ బరీమఠాధిపతి చాలా ఐశ్వర్యం సంపాదించాడని విన్నాడు.

మఠాధిపతికి ఒక పెద్దభవనం ఉందనీ, దానినిండా చాలా విలువగల వస్తువులెన్నో ఉన్నాయనీ, ఎప్పుడూ వందమంది సేవకులు అతనికి సేవచేస్తూ ఉంటారనీ, ప్రజలు రహస్యంగా చెప్పుకునేవారు. పైగా మఠాధిపతి సేవకులకు కూడా మెళ్లల్లో బంగారు గొలుసులు ఉన్నాయని పుకారు పుట్టింది. ఇవన్నీ వినేటప్పటికి మహారాజుకి చాలా కోపం వచ్చింది. అలాంటి భోగభాగ్యాలు మహారాజైన తనకు తప్ప, ఇంకెవరికీ ఉండటానికి వీల్లేదన్నాడు. వెంటనే మఠాధిపతిని పిలిపించి కోప్పడ్డాడు.

"ఏమండీ! మఠాధిపతిగారూ! మీ మందిరం మహారాజు భవనంకన్నా ఆడంబరంగా ఉన్నదిటే? ఇది యేం పెద్దమనిషి తరహా? ఇదేనా మీ మర్యాద!" అన్నాడు.

మఠాధిపతి ఎంతో వినయంగా చేతులు కట్టుకుని నిలబడి జవాబు చెప్పాడు.

"ప్రభూ! ఈ పుకారు నిజమని నమ్మకండి. వట్టి అబద్ధం. నేనంత ధనవంతుణ్ణి కాను. నా సొంతం కానిది ఒక్క పెన్నీ (ఆ దేశంలోపెన్నీ మనదేశంలో దమ్మిడీలాంటిది) కూడా ఎన్నడు నేను ఖర్చుపెట్టనని అందరికీ తెలిసినసంగతే మహారాజా!" అన్నాడు.

"అంటే, నేను నా సొంతంకాని డబ్బు ఖర్చు పెడుతున్నాననేగా నువ్వంటూంది! నీమాటలు మాకు చాలా అవమానకరంగా ఉన్నాయి. నీకు మరణదండన విధిస్తున్నాను," అన్నాడు రాజు.

"మహారాజా! నేను తమర్ని అవమాన పరుస్తానా? నేనంటే ద్వేషం గలవారెవరో పుట్టించిన వదంతుల సంగతి చెప్పాను. అంతే మహారాజా!" అని మఠాధిపతి విడబరచి చెప్పాడు రాజుగార్కి.

"ఏమో! నువ్వు మాట్లాడుతున్న ధోరణి మాకేమాత్రం నచ్చలేదు. నీకు శిక్ష తప్పదు. అయితే నీప్రాణం రక్షించుకోటానికి ఒక్క అవకాశంమాత్రం ఇస్తున్నాను. నేను అడిగే మూడు ప్రశ్నలకు నువ్వు నాకు బాగానచ్చే సమాధానాలు చెపితేనే, ఉరితీసే తలవరి చేతుల్లోంచి నువ్వు తప్పించుకోగలుగుతావు," అని కచ్చితంగా చెప్పేశాడు మహారాజు.

వేరే దోవ ఏమి లేక పోయింది. పాపం! మఠాధిపతి "సరే, మహారాజా! ఆ మూడు ప్రశ్నలుచెప్పండి. తగిన సమాధానాలు చెప్పటానికి ప్రయత్నిస్తా," నన్నాడు.

"అయితే, విను! ఈ మూడుప్రశ్నలు శ్రద్ధగావిను :—

"మొదటిది : నా విలువ ఎంతో సరీగ్గా ఒక పెన్నీ తేడా లేకుండా చెప్పాలి.

"రెండోది : నేను ప్రపంచమంతా ఎంత త్వరలో తిరిగి రాగలనో చెప్పు.

"మూడోది : నేను మనస్సులో ఏమను కుంటున్నానో సరిగ్గా చెప్పాలి. నువ్వు ఈ ప్రశ్నలకు సరియైన జవాబులు చెప్పలేక పోయావంటే, ఉరి తీసే తలవరి ఇక్కడే సిద్ధంగా ఉన్నాడు," అని మహారాజు కఠినంగా చెప్పాడు.

మఠాధిపతి ఎంత గొప్ప పండితు డైనా ఆ మూడు ప్రశ్నలలో ఒక్కదాని కైనా ఏమీ సమాధానం చెప్పలేక చాలా కంగారు పడిపోయాడు. "అయితే, మహారాజా! నాకు మూడు వారాలు గడువు ఇవ్వండి," అని వేడుకొన్నాడు. 'సరే' నని మహారాజుగారు ఒప్పుకున్నారు.

మఠాధిపతి ఎంతో చిన్నబోయి విచారంతో వెళ్ళిపోతున్నాడు. ఇంగ్లాండు దేశంలో గొప్ప, గొప్ప పండితులు ఉండే కేంబ్రిడ్జ్, ఆక్స్ఫర్డ్ కళాశాలలు, విద్యా కేంద్రస్థానాలు అన్నీ తిరిగాడు. ఎంత తిరిగినా, అక్కడ ఉన్న తెలివిగల ఉపాధ్యాయులు గాని, పండితులు గాని ఆ ప్రశ్నలకు సరియైన సమాధానాలు చెప్పలేక పోయారు. ఇంకా కొన్ని రోజులు మాత్రమే గడువు ఉందనగా మఠాధిపతి విచారంగా ఇంటికి పోతున్నాడు.

ఇంతలో రోడ్డు ప్రక్కన, గొఱ్ఱెలు కాసుకుంటూన్న గొల్లవాడొకడు కనిపించి, "రండిసామీ! మా ఇంటికి దయ సేయండి. రాజుగారి సబలో యిశేసాలు నాకు సెప్పండి," అని ఆప్యాయంగా అడిగాడు.

"ఏముంది బాబూ! ఏం చెప్పమన్నావు? ఇంక మూడు రోజులే నేను బ్రతికి ఉండేది. మహారాజుగారు అడిగిన మూడు ప్రశ్నలకు సమాధానాలు చెప్పకపోతే, ఆ రోజునే నా తల ఎగిరి పోతుంది," అని విచారంగా చెప్పాడు, మఠాధిపతి.

"అయ్యగోరూ! ఆ పెశ్నె లేంటో నాక్కూడా కూత్త సెప్పండి సామి!" అన్నాడు గొల్లాడు.

మఠాధిపతి ఆ ప్రశ్నలు మూడూ వరసగా ఇట్లా చెప్పాడు; "మొదటి ప్రశ్న :- నేను రాజుగారి విలువ ఒక్క పెన్నీకూడా ఎక్కువ తక్కువ లేకుండా చెప్పాలిట. రెండో ప్రశ్న ఏమి టంటే, మహారాజు లోకమంతా ఎంత వేగంగా తిరిగి రా గలడో చెప్పాలి. మూడో ప్రశ్న, మహారాజుగారు ఏమి అనుకుంటు న్నారో నేను చెప్పాలి."

"సామీ! మీరు దిగులు పడమోకండి. ఉసారుగా వుండండి. యెఱ్ఱి గొల్లడు కూడా, కొన్ని సమయాల్లో తెలివి గలోరికి మల్లే సెమత్కారంగా మాటలు సెప్పగల్డని మీకూ తెల్సుగా సామీ! గొప్ప గొప్పోరి కంటే గొల్లోడు మేలన్న సామెత మీరు యినుకునే ఉంటారు. నా కో గుఱ్ఱం, మీ కోటు, బూట్సులు అన్నీ యిప్పియ్యండి. మీ నౌకరోళ్లందరినీ నా యెంట పంపియ్యండి. నేను లండను పట్నం యెల్లి తమరు సెప్పాల్సిన జవాబులన్నీ నానే సెప్పేసి సక్కావొస్తాను," అని గొల్లవాడు ఉత్సాహంగా చెప్పాడు.

కాంటర్‌బరీ మఠాధిపతికి, ఈ వెఱ్ఱి గొల్లడు తన వేషంలో వెళ్లటం ఏమాత్రం ఇష్టం లేదు. కాని, ఏం చేస్తాడు. ఆ గడ్డు ప్రశ్నలకి సమాధానం చెపుతా నన్నవాడు ఈ గొల్లవాడు తప్ప ఇంకెవరూ కనిపించలేదు. గొల్లవాడు చెప్పినదానికి ఒప్పుకున్నాడు మఠాధిపతి. గొల్లవాడికి తన గుడ్డలు, గుఱ్ఱం, కొంత డబ్బు, వాడితోకూడా వెళ్లటానికి తన సేవకుల్నీ ఇచ్చి, తాను ఇంటికి పోయాడు. గొల్లవాడు మఠాధిపతి లాగా దర్జాగా వేషం వేసుకొని గుఱ్ఱమెక్కి లండను నగరానికి వెళ్లాడు.

జాన్ మహారాజు, మఠాధిపతి రూపంలో వచ్చిన గొల్లవాణ్ణి చూచి మఠాధిపతే అనుకొన్నాడు. కోపంగా "నా మూడు ప్రశ్నలకీ జవాబులు చెపుతావా ? చెప్పలేక పోతే నేను చెప్పిన ప్రకారం నీ ప్రాణం నీకు దక్కదు," అన్నాడు.

మరునాడు మహారాజు తన సభలో తన అందమైన ఎఱుపునీలం కలిసిన మబ్బురంగు పట్టుదుస్తులను వేసుకొని రత్నాలు మెరిసిపోయే కిరీటంధరించి, వచ్చి సింహాసనంమీద కూచున్నాడు. తక్కిన ప్రభువులు, ఇతర సభాసదులు, చిన్న పెద్ద దొరలు, సేవకులు అందరూ ఈ వింతప్రశ్నలకి సమాధానాలు వినటానికి రాజసభకు వచ్చికూచున్నారు. సభ వెలుపల, నల్లనిదుస్తులు ధరించిన ఉరితీసే తలవరి సిద్ధంగా నిలబడి ఉన్నాడు.

మఠాధిపతి వేషంలోవచ్చిన గొల్లవాడు రాజసభకి వచ్చాడు. మహారాజుకి వినయంగా నమస్కరించి, "ప్రభూ ! మీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పమన్నారా?" అన్నాడు. సభాసదు లందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

మహారాజు "మొట్టమొదట, నా విలువ ఒక పెన్నీకూడా ఎక్కువ తక్కువలేకుండా చెప్పాలి," అన్నాడు.

"ప్రభూ! అది చాలా సులభం.

"మన అందమైన దేశంలో మనము 'సావరిన్' అని చెప్పే నాణెం విలువ ఇరవై షిల్లింగులేగద! 'క్రౌను' అని చెప్పే నాణెంవిలువ ఐదు షిల్లింగులు. అయితే! ప్రభూ! మీరు మనదేశానికి 'సావరిన్' (అనగా చక్రవర్తి) గదా! మీరు చక్రవర్తి. కాబట్టి మీకు ఒక 'క్రౌను' (అంటే కిరీటం) కూడా ఉన్నదిగదా! కాబట్టి మీరు ఒక సావరిన్, ఒక క్రౌను-అనగా మొత్తం ఇరవై ఐదు షిల్లింగుల విలువగలవారు," అన్నాడు.

[ఆ దేశపుభాషలో 'సావరిన్' అంటే రెండర్థాలు ఉన్నాయి. ఒకటి ఇరవై షిల్లింగులు విలువగల సావరిన్ నాణెం. రెండో అర్థం చక్రవర్తి. అలాగే "క్రౌన్" అంటే ఒక అర్థం ఐదు షిల్లింగులు విలువైన ఒక నాణెం. రెండో అర్థం కిరీటం.]

ఈ చమత్కారపు మాటలు వినగానే మహారాజు నవ్వు ఆపుకోలేక పోయాడు. "నా విలువ ఇంత తక్కువని నేను ఎప్పుడు అనుకోలేదు. అయినా, ఈ జవాబు చమత్కారంగా, బాగానే ఉందని ఒప్పుకుంటాను. ఎందుకంటే, ఈ లెక్కలో ఎక్కడా తప్పు పట్టటానికి వీలు లేదు. సరే! ఇక రెండవ ప్రశ్నకు బదులు చెప్పు చూద్దాం," అన్నాడు మహారాజు.

"నేను ఎంత త్వరగా ఈ ప్రపంచం చుట్టూ తిరిగి రాగలను?"

"ఈ ప్రశ్న గూడా చాలా సులభంగానే వుంది మహారాజా! మీరు సూర్యుడితో నిద్రలేచి అతని వెంట ప్రయాణం చేసి, వెనకబడకుండా, మరునాటి సూర్యోదయంవరకు తిరిగివస్తే, మీరు ఈ లోకమంతా ఇరువైనాలుగు గంటలలో చుట్టిరాగలరు," అని బదులు చెప్పాడు గొల్ల.

రాజు మళ్ళీ ఫక్కున నవ్వి, "ఈ జవాబు మరీ చమత్కారంగా, బాగా ఉంది," అన్నాడు.

"నీవు చెప్పింది నిజమే! ఔను, సూర్యునితో పాటు ప్రయాణం చేస్తే తప్ప, ఈ ప్రపంచం చుట్టి రావటానికి వేరే మార్గం లేదు. సరే ఇక అన్నిటి కంటే కఠిన మైన ప్రశ్న మూడోది వుంది. ఈ క్షణంలో నేను ఏ మను కుంటున్నానో చెప్పాలి."

"ఈ ప్రశ్న అన్నిటి కంటే చాలా సులభ మైనది మహా రాజా! నేను కాంటర్‌బరీమఠాధిపతిని అని మీరు అను కుంటున్నారు. నిజానికి నేను కాంటర్ బరీ మఠాధిపతిని కాను. నేను ఆ అయ్యవారికి గొఱ్ఱెలు కాసే పేద గొల్లోణ్ణి, నా యజమాని ప్రాణం రక్షించమని తమరిని ప్రార్థించటానికి వచ్చాను మారాజా!" అని గొల్లవాడు తన మామూలు మాటల్లో చెప్పాడు.

గొల్లవాడు తాను వేసుకొన్న మఠాధిపతి వేషమంతా విప్పేశాడు. నిజంగా వాడు వెఱ్ఱి గొల్లడే అని, కాంటర్ బరీ మఠాధిపతి కాదని అందరికీ తెలిసి పోయింది.

ప్రభువులు, సభాసదులు అంతా కడుపు లుబ్బిపోయేటట్టు నవ్వారు. జాన్ మహారాజు మాత్రం మొదట తా నిలా మోసగింప బడటం చూసి ముఖం ముడుచుకున్నాడు. అయితే, మళ్ళీ వెంటనే అందరితో పాటు తనూ నవ్వేశాడు.

నవ్వినకొద్దీ, రాజుగారికి ఆ నాడు రాజసభలో జరిగిన తమాషా చాలా బాగుంది అనిపించింది. మహారాజు సంతోషించి, మఠాధిపతిని క్షమించాడు. గొల్లవాడికి గొప్ప బహుమానం ఇచ్చి పంపాడు.

'గ్రేట్ బ్రిటన్'

## 5. పేద కాపు—గుఱ్ఱపు రౌతు

పూర్వం ఒక చిన్న పల్లెటూళ్లో ఒక కాపు ఉండేవాడు. అతను అమెరికాదేశంలో చాలాకాలంగా ఉంటూన్న అడవిజాతి రైతు. అక్కడ వాళ్ళని రెడ్ఇండియన్లంటారు. పాపం, ఆ కాపు చాలా పేదవాడు. ఒకనాడు అతనికి 'నికోయా' పట్నంలో జరిగే గొప్ప ఉత్సవానికి వెళ్ళి చూడాలని సరదా పుట్టింది. ఆ ఉత్సవం 'గోడలూప్' అనే ద్వీపంలో ఒక దేవకన్యనుగూర్చి చేసే జాతర. ఈ కాపు ఉన్న చిన్నగ్రామం అందమైన కొండ ప్రక్కన ఉంది. అక్కణ్ణించి ఈ ఉత్సవంజరిగే 'నికోయా' నగరం చాలా దూరాన ఉంది. ప్రయాణం చాలాకష్టం. అయినా, కాపు ఎట్లాగో ఆ ఉత్సవానికి వెళ్ళితీరాలని నిశ్చయించుకున్నాడు. ప్రయాణానికి కావలసిన భోజన పదార్థాలన్నీ ముందుగానే జాగ్రత్త పెట్టుకొని ఒక పెద్దమూట కట్టుకున్నాడు. ఆ మూటలో అరటి పళ్లు, మామిడిపళ్లు, ఎండుచేపలు, తాగటానికి ద్రాక్షసారా—ఇంకా తనకు కావలసినవన్నీ పెట్టుకున్నాడు.

ఇవన్నీ పెట్టి కట్టేటప్పటికి మూట బాగా పెద్దదైంది. కాపు మూట బుజానికి తగిలించుకొని 'నికోయాకు' ప్రయాణ మయాడు. పోగా పోగా ఎండవేడికి, గాలిదుమ్ముకి ఎంతో అలసిపోయాడు. అలసిపోయి ఒక చెట్టునీడన కూల బడ్డాడు.

కాపు ఆ చెట్టుకిరింద కూచుని ఉండగా, ఒక పెద్దమనిషి గుఱ్ఱం ఎక్కి ఆ దారినే వస్తున్నాడు. కాపు చూశాడు. ఆ చెట్టునీడకు రాగానే రౌతుకూడా అక్కడ ఆగి, తన గుఱ్ఱాన్ని విప్పి, పచ్చిక మేయటానికి వదిలాడు. కాపు ఆయనకి నమస్కారం చేశాడు. ఆయన కాపుని గీర్వాణంగా పలకరించి ఊరుకున్నాడు. కాపు, ఆ ధనవంతుడైన రౌతు ఎక్కివచ్చిన నున్ననైన, షోకైన గుఱ్ఱాన్ని చూసి, "నేనుకూడా నా మూటతో పాటుగా ఈ గుఱ్ఱంమీద కూచుని పోగల్గితే ఎంత బాగుండును," అనుకున్నాడు.

"మీరు ఎందాక యెల్తాఉండారు దొరా!" అని మెల్లగా కాపు ఆ గుఱ్ఱపురౌతుని అడిగాడు.

"నికోయా నగరానికి," అన్నాడు రౌతు. "అలాగా! దొరా! నేనూ 'నికోయా'లో జరిగే గూడలూప్ తిర్నాళ్లు సూడాలనే యెళ్తున్నాలెగండి. భలే! మనిద్దరం ఒకసోటికే యెల్తూ ఇక్కడ కల్సుగుంటం యిసితరింగా కలిసొచ్చింది దొరా!" అని చెప్పగానే రౌతు నిర్లక్ష్యంగా బుజాలు ఎగరేశాడు.

"దొరా! 'నికోయాకి' పెయానమంటే శానా కట్టం బాబూ! ఎండ మాడిసేత్తావుంది. దానికితోడు నాకీ మూటోటి! మొయ్యలేక మెడజివ్వలు పీకుతావున్నాయి దొరా! కాత్త మీతో నన్ను గూడా మీ గుఱ్ఱంమీద కూకోపెట్టుకొని, కొంతలెక్క తీసుకెల్లండి దొరా! మీ కెంతో పున్నెముంటుంది," అన్నాడు కాపు వినయంగా.

రౌతు ఒక్కసారి కాపుని, అతని మూటనీ ఎగా దిగా చూశాడు. "నా గుఱ్ఱం మన ఇద్దరిని నీ పెద్దమూటనీ మొయ్యలేదు. ఏం చెయ్యమన్నావ్!" అన్నాడు.

ఆ పెద్దమనిషి అలా అన్నందుకు ఆ పేదకాపుకి కొంచెం కూడా కోపంరాలేదు.

"నా మూటకూ్కడా రెండు కాళ్లుంటే బాగుండిపోయేది దొరా! దానికి కాళ్లు ఇప్పుడు ఎక్కణ్ణుండి మొలుసుకొత్తాయి లెగండి! నామూట నేను మోయక ఎలాగో తప్పదుగదుండి. పోనీ, నామీద కూంత దయసూపి, నా మూటయినా కొత్త మీ గుఱ్ఱంమీద పెట్టుకోనీయండి దొరా! నే నెట్లాగో కాళ్ళీడుసుకుంటూ మీ యెనకాలబడి వత్తాను," అని నెమ్మదిగా చెప్పాడు కాపు.

"వీలులేదయ్యా, అంత బరువుగల మూట నా గుఱ్ఱంచేత మోయించి దాన్ని బాధ పెట్టను," అంటూ రౌతు ఆ గుఱ్ఱం ఎక్కి చకచకా 'నికోయా' వైపు వెళ్ళిపోయాడు.

గుఱ్ఱపురౌతు కనుమరుగు అయ్యేంతవరకు కాపు అలాగే చూస్తూ నిలబడ్డాడు. తరువాత తనలో తానే ఇట్లా అనుకున్నాడు. "అంతదూరం నే నెట్లా నడిసిపోగలనో యేంటో! 'నికోయా' ఇంకా శానా దూరముండదిగందా! ఇక్కడ కూకోని బాగా తిండి తిని బలం తెచ్చుకోని నడుత్తాను," అని చెట్టుకింద హాయిగా కూచుని, మూట విప్పాడు. భోజన పదార్థాలు, పళ్లు, ద్రాక్షసారాసీసా బయటికితీసి, తాపీగా, తృప్తిగా కడుపునిండా తిన్నాడు. దాహం వెయ్యకుండా ద్రాక్షసారా తాగేశాడు. ఇంతలో ఆ గర్వపోతురౌతు గుఱ్ఱమెక్కి పోతూఉండగా తనను సాయం అడిగిన పేదకాపూ, అతనిమూట జ్ఞాపకం వచ్చినయి.

"నే నాపల్లెటూరి మోటమొద్దునీ, వాడి మూటనీ నాతోపాటు గుఱ్ఱంమీద కూచోపెట్టుకొని వెళితే నా స్నేహితులు, బంధువులు చూసి ఎంతనవ్వుకునేవారో!" అనుకుంటూ సాగిపోతున్నాడు.ఎంత ప్రయత్నించినా రౌతుకి ఆ కాపువాడి మూటమాత్రం మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం వస్తూనే ఉంది. ఆ మూట సందులగుండా తాను చూసిన

పెద్ద పెద్ద అరటిపళ్లు, మామిడిపళ్లు జ్ఞాపకం వచ్చాయి. మూటలో ఓపక్కన మంచి ద్రాక్షసారా సీసాకూడా చూసినట్లు జ్ఞాపకం.

మిట్టమధ్యాహ్నప్రయాణం అవటంవల్ల ఆ రైతుకి ఎండ దెబ్బ తగిలింది. తగని ఆకలి వేస్తూంది. గొంతెండి పోతూంది. 'నికోయా' ఇంకా బోలెడంత దూరం ఉందని రైతుకి తెలుసు. వెంటనే గుఱ్ఱాన్ని ఆపేశాడు. మనస్సులో ఇట్లా అనుకొన్నాడు. "ఛీ ఛీ! ఎంత తెలివితక్కువ వాడిని! ఆ కాపు మూటనిండా కావలసినన్ని పళ్లు ఉన్నాయి. నే నతనికి కాస్త సాయంచేసి ఉంటే, ఆ కాపు తప్పక ఆ పళ్లూ అవీ నాకు కూడా కొన్ని ఇచ్చే వాడే. ఎంత వెఱ్ఱి పనిచేశాను!" అని రైతు తన గుఱ్ఱాన్ని వెంటనే వెనక్కి తిప్పాడు. మళ్ళీ కాపు ఉన్నచోటికి వచ్చాడు. కాపు కడుపునిండా ఫలహారంచేసి అప్పుడే మళ్ళీ మూట బిగించి కట్టేసుకుంటున్నాడు. అతని భోజనం పూర్తి అయిందని నేల మీద పడివున్న పళ్ళ తొక్కలూ అవీ చూస్తేనే తెలుస్తూంది.

"ఏమయ్యో! ఇటుచూడు! నేను ఇంతసేపూ బాగా ఆలోచించాను. నీ కెట్లాగైనా సాయం చెయ్యాలని. పాపం! నీ మూటనయినా నా గుఱ్ఱంమీద తీసుకువద్దామని మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చేశాను. తే! ఆ మూట ఇల్లా ఇయ్యి. గుఱ్ఱంమీద పెట్టుకొస్తాను," అన్నాడు రైతు. కాపు నవ్వుతూ, "మంచిమాటే లెగండి దొరా! తమరు శానా దయగల పెబువులు! కానీండి, ఇప్పుడు పరవాలేదులే దొరా! నాను తెచ్చుకున్న పలారాలు శానా వరకు సెల్లించేశాగా! దాంతో నాకాళ్ళకి మల్లీ కాత్తంత చెత్తి వచ్చింది లెగండి. ఇంక బయం లేదు. శకశకా నడవగలను. అదీ కాకోకుండా, నా మూటకూడా శానావొరకు బరువు తీసిపోయింది. ఇంక సులాగ్గా మొయ్యగలను. మీకు కట్టంవద్దు దొరా! యెల్లిపోండి! గుఱ్ఱాన్ని ఉరుకు లెత్తించుకుంటూ కులా

సగెల్లిపోండి! నేను మెల్లగా 'నికోయా'కు సేరుకుంటా లెగండి,"
అంటూ కాపు తనమూట బుజాన వేసుకొని దోవబట్టాడు.

ఏం చేస్తాడు, ఆ గర్వపోతురౌతు! తనదారిన తానుపోక తప్పదు. అయితే తాను మొదటే ఆ పేదకాపుకు కాస్త సాయంచేస్తే తనకు ఆకలేసినప్పుడు మంచి ఆహారం దొరికేది. ఇప్పుడది తప్పిపోయిందే అని విచారిస్తూ 'నికోయా' దారిపట్టి పోయాడు.

కో స్ట రీ కా




పేదకాపు - గుర్రపురౌతు




పాము - కలలు

# 6. పాము – కలలు

ఒకానొక దేశంలో ఒక రాజుండేవాడు. ఆ రాజుకి ఒక విచిత్రమైన కల వచ్చింది. రాజ భవనం కప్పునించి ఒకనక్క తల క్రిందులుగా వేళ్లాడుతున్నట్టు ఆ కలలో కనిపించింది. దాని తోక మాత్రం కప్పుని అంటుకుని ఉంది. రాజుకి నిద్రలేచాకకూడా ఈ కలే మాటమాటకి జ్ఞాపకం వస్తూంది. ఈ కలకు అర్థం ఏమిటా అని ఆలోచించటం మొదలుపెట్టాడు రాజు. ఎంత ఆలోచించినా రాజు కేమీ తోచలేదు. చివరికి మంత్రుల్ని, పండితుల్ని పిలిచి తనకల వాళ్ళందరికీ చెప్పాడు. "కలలో నక్క ఇట్లా ఇంటి కప్పు పట్టుకొని వేళ్లాడుతున్నట్టు కనిపిస్తే ఫలితం ఏమిటో తేల్చి చెప్పండి," అన్నాడు.

వారిలో ఎవరూ ఈకలకు అర్థం చెప్పలేకపోయారు. మాటి, మాటికి ఈ కలే రాజుగారికి జ్ఞాపకం వస్తూంది. క్షణంసేపు కూడా ఆ కలను మరచిపోలేకపోయాడు. చివరకి రాజు గొప్ప మహాజన సభ ఏర్పాటుచేసి, రాజ్యంలో ఉన్నవాళ్లందరిని పిలిపించమన్నాడు. వారిలో ఎవరైనా తెలివిగా తన కలకు అర్థం గ్రహించి చెప్పలేకపోతారా అనుకున్నాడు. వెంటనే ఆ నగరంలో ఒక మహాజనసభ ఏర్పాటు చేశారు.

ఈ మహాజనసభకి ఎక్కడెక్కడివాళ్ళూ వస్తున్నారు. "ఇవాన్" అనే పేదకాపుకూడా నగరానికి బయలుదేరివస్తూ

దోవలో కొండరాతి ప్రదేశానికి చేరుకున్నాడు. కొండప్రక్కగా ఉన్న కాలిదారి మీదుగా నడచి వస్తున్నాడు. ఆ దారికి అడ్డంగా ఒకపాము పడుకొని ఉంది. ఇవాన్ ఆ పామునుచూసి ఆగాడు. పాము తలయెత్తి ఆ కాపుని పలకరించింది. "నమస్కారం కాపన్నా! ఎందాకా ఈ ప్రయాణం?" అని కాపుని అడిగింది. రాజుగారు నగరంలో జరిపే మహాజనసభ సంగతంతా ఇవాన్ ఆ పాముతో చెప్పాడు. రాజ్యంలో ప్రజలందరినీ రాజుగారు ఆ మహాజనసభకు రావాలని చాటింపు చేశారనికూడా చెప్పాడు.

"అయితే నేను ఆసభకువెళ్లటంవల్ల ఏమీ ప్రయోజనం ఉండదులే! అన్నాడు. నా మొహం! రాజుగారి కలకి నేనేం అర్థం చెప్పగలను!"

"ఎవరైతే రాజుగారి కలకు సరిగా అర్థం చెప్పకలుగుతారో వాళ్ళకి ఆ రాజు తప్పకుండా మంచి బహుమతి ఇస్తాడు. నీకే ఆ బహుమతివస్తే అందులో నాకు భాగం ఇస్తానంటే, నేనా రాజు కలకు అర్థం ఏమిటో నీకు చెపుతాను," అంది పాము. ఈ మాట వినగానే ఇవాన్‌కి ఆశపుట్టింది. "నువ్వు నాకు సరియైన జవాబు చెబుతే, నేను సందేహం లేకుండా నా కొచ్చే బహుమతిలో నీకూ సగం ఇస్తాను. పైగా, నువ్వుచేసిన మేలు ఎన్నటికీ మరచిపోను," అన్నాడు ఇవాన్.

"అయితే సరే! నేను చెప్పబోయే సమాధానం జాగ్రత్తగా విను మరి," అంది పాము.

"నక్క రాజభవనం కప్పునించి వేల్లాడటానికి ఇదీ అర్థం: ఇప్పుడు రాజుగారి రాజ్యమంతా జిత్తులతో, మోసాలతో, ద్రోహాలతో నిండి వున్నదన్నమాట," అని చెప్పింది పాము.

కాపు పాముకి కృతజ్ఞతతో నమస్కారంపెట్టి, మెల్లగా నగరం చేరుకున్నాడు. సభలోకి వెళ్ళాడు. అతని వంతు

రాగానే, ఇవాన్‌ని రాజు ముందుకి తీసుకుపోయారు. పాము చెప్పిన ప్రకారం ఇవాన్ ఒక్కమాట కూడా వదలిపెట్టకుండా చెప్పాడు. రాజుగారి కల రాజ్యమంతా జిత్తులతో, మోసాలతో, కుట్రలతో నిండి వున్నదని సూచిస్తూందని చెప్పేశాడు. రాజు, చాలా సంతోషించి, ఇవాన్‌కు కొంత ధనం, విలువగల బహుమతులు ఇచ్చాడు. ఇవాన్ ఇంటికి బయలుదేరి వెళ్ళటానికి ముందు మనస్సులో ఇట్లా ఆలోచించుకున్నాడు. "ఈ బహుమతులు నే నెందుకు ఆ పాముకు పంచిపెట్టటం? అనవసరం!" అని వచ్చిన దోవను గాక, వేరే దారిని పాము కంట బడకుండా ఇల్లు చేరుకున్నాడు.

మళ్లీ కొన్నాళ్లకి రాజుగారికి మరో కల వచ్చింది. ఈ కల ఏమిటా అని రాజు మళ్ళీ దిగులు పడటం ప్రారంభించాడు. ఈ సారి కలలో ఒక కత్తి రాజభవనం కప్పునుంచి వేళ్లాడుతున్నట్లు రాజుకు కనబడింది.

మొదటి కలను గురించి 'ఇవాన్' చక్కగా చెప్పాడు కాబట్టి మళ్ళీ రాజుగారు వెంటనే ఇవాన్‌ను పిలుచుకు రమ్మన్నాడు. ఇది వినగానే ఇవాన్ గుండెలో రాయి పడింది. తనకు కలలకు అర్థంచెప్పటం చేతకాదని అతనికి బాగా తెలుసు. అందుచేత దిగులు పట్టుకుంది. ఇంకేం చేస్తాడు పాపం! మళ్ళా ఆ పాము దగ్గరికే వెళ్ళి బ్రతిమాలుకుందాం, అనుకున్నాడు. కాని, తీరా ఆ కాలిబాట దగ్గరకు వెళ్లి చూస్తే పాము కనుపించలేదు. ఇంకేమీ తోచక, పామును గట్టిగా గొంతెత్తి పిలిచాడు.

"నాగన్నా! నాగన్నా! ఒక్క నిముషం ఇట్లా బయటికి రావూ? నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి," అంటూ పాము పుట్టదగ్గరికి వెళ్ళి, పాము కనుపించేదాకా అల్లా కేకలు పెడుతూనే ఉన్నాడు.

"మళ్ళీ ఏమి కష్టం వచ్చింది కాపన్నా? ఇప్పుడు నన్నేమి చేయమంటావు?" అంది పాము బయటికి వచ్చి.

"రాజుకి మళ్ళీ ఇంకొక కల వచ్చిందిట. దానికి కూడా నేనే అర్థం చెప్పాలని నాకు కబురుపంపాడు రాజు. నన్నేమి బదులు చెప్పమంటావు? నా కేమీ తలాతోకా తెలియక నీ దగ్గరకు పరిగెత్తుకొచ్చా," అన్నాడు కాపు ఎంతో ఆదుర్దాగా.

"బాగానేవుంది గాని మరి, నీకు దొరికే బహుమతి నాకు కూడా పంచిపెడతానంటే చెపుతా. లేకపోతే లేదు," అంది పాము.

"నిజంగా ఈసారి నాకు దొరికిన బహుమతిలో తప్పకుండా నీకు భాగం ఇస్తాను," అని ఇవాన్ నమ్మకంగా చెప్పాడు.

పాము ఇవాన్ తో ఈ మాటలు చెప్పి పంపింది.

"రాజమందిరం కప్పునుండి కత్తి వేళ్లాడుతున్నట్టు రాజుకు కలరావటం త్వరలో యుద్ధం రా బోతూందని సూచిస్తుంది. విరోధులు రాజ్యం లోపల, వెలుపలాకూడా రాజుమీద కుట్రలు పన్నుతున్నారు. యుద్ధం, ప్రాణనష్టం, త్వరలో కలుగబోతూంది. కాబట్టి రాజు తన రాజ్యాన్ని అన్నివిధాల రక్షించుకోటానికి తయారై ఉండాలి."

ఈ మాటలు ఇవాన్ రాజుగారితో చెప్పగానే రాజు చాలా మెచ్చుకొని, మళ్ళీ చాలా విలువగల బహుమానాలు ఇచ్చి పంపాడు.

మంచి బహుమతులు చేతులో పడేటప్పటికి ఇవాన్‌కి వాట్లో పాముకు భాగం ఇవ్వటానికి ఇష్టం లేకపోయింది. పాముతో భాగం పంచుకోవట మేమిటి వెఱ్ఱితనం! ఇవాన్‌కి కోపం వచ్చేసింది. ఇవాన్ పాముదగ్గిరికి వచ్చాడు.

కాపుకోసం ఎదురుచూస్తూన్న పాము, "నా సగం భాగం నాకిచ్చి పో కాపన్నా !" అంది.

"ఏమిటే నీ కిచ్చేది ? నీ కిచ్చేవల్లా రెండు దెబ్బలే," అని గట్టిగా అరిచాడు ఇవాన్. అరుస్తూనే కత్తి సర్రున దూసి, పామును చంపబోయాడు. పాము గబ గబా పుట్టలోకి పారి పోయింది. అయినా ఇవాన్ దానితోక కత్తితో నరికిపారేశాడు. తరువాత ఇవాన్ ఇల్లు చేరుకున్నాడు. తనకు అంత తేలికగా లభించిన భాగ్యాన్ని చూసుకొని మురిసిపోయాడు. పాముసంగతే మరచిపోయాడు.

చాలాకాలం గడచిపోయింది. రాజు కల సూచించినట్టే రాజ్యంలో పెద్ద యుద్ధం వచ్చిపడింది.

అయితే రాజు సైనికులంతా సిద్ధంగా ఉన్నందువల్ల, ధైర్యంగా యుద్ధం చేశారు. రాజుకు జయం కలిగింది.

ఇట్లా ఉంటుండగా, కొన్నాళ్ళకి రాజు మరొక విచిత్రమైన కలగన్నాడు. ఈసారి కలలో ఒక గొఱ్ఱె ఇంటికప్పునించి వేళ్లాడుతున్నట్లు కనిపించింది. మళ్ళీ రాజు ఈ కలసంగతి కూడా తెలుసుకోటానికి ఇవాన్‌ని పిలిపించాడు.

ఇవాన్ ఈసారి చాలా భయపడ్డాడు. తాను ఏ ముఖం పెట్టుకుని మళ్ళీ పాముదగ్గరికి వెళతాడు ? సిగ్గు శరం లేకుండా, ఎల్లా సాయం అడగటం ?

"పాముకి అంత అన్యాయం, ద్రోహం చేసి పైగా దాని తోకకూడా నరికేశానే !" అని బాధపడ్డాడు. ఎంత ఆలోచించినా ఇవాన్‌కు వేరే గతి కనపడలేదు. ఏం చేస్తాడు ? మళ్ళీ పామునే బ్రతిమాలుకోవాలి. తప్పదు. పాముఉన్న కొండదగ్గిరికి వచ్చి

పాము పుట్టలోంచి బయటికి వచ్చేంతవరకూ కేకలు పెట్టాడు. చివరికి పాము వచ్చింది. తనకు వచ్చిన కొత్తచిక్కు చెప్పాడు.

"రాజు నీకిచ్చే బహుమతుల్లో సగం నాకిస్తానని ప్రమాణం చేస్తేగాని, నేను నీకు చెప్పను," అంది పాము మళ్ళీ వెనకటిలాగే.

"ముమ్మాటికి నిజంగా నీ భాగం నీకు ఇచ్చేస్తాను," అని ఒట్టు పెట్టుకున్నాడు ఇవాన్.

పాము ఇవాన్‌తో ఇట్లా చెప్పింది: "గొఱ్ఱె రాజమందిరపు కప్పునుండి వెళ్లాడటం మంచి శుభసూచనే. రాజ్యం ఇప్పుడు పాడిపంటలతో కలకలలాడుతూ, భోగభాగ్యాలతో తులతూగుతూ హాయిగా ఉంది. ప్రజలందరూ సంతృప్తిగా, సుఖంగా బ్రతుకు తున్నారు. ఇదే ఆ కలకి అర్థం," అంది.

ఇవాన్ రాజభవనానికివెళ్ళి, పాము చెప్పినమాటలు ఉన్నవి ఉన్నట్లుగా చెప్పాడు.

రాజు బ్రహ్మానందం పొందాడు. సంతోషం పట్టలేక ఈసారి ఇవాన్‌కి ఇంకా ఎక్కువధనం, చాలా బహుమతులూ ఇచ్చాడు.

ఈసారి ఇవాన్ సంతోషంగా పాము ఉన్నచోటికి వచ్చాడు. కాపుకోసం పాము ఎదురుచూస్తూంది. ఇవాన్ తనకు రాజిచ్చిన బహుమతులలో సగం పాము ముందరపెట్టి, మెల్లగా ఇట్లా అన్నాడు:

"నేను నీకు ఎంత ద్రోహంచేసినా, నువ్వు ఓర్పుతో నా మీద దయ చూపించావు. ఇదిగో! ఈసారి రాజుగారు నా కిచ్చిన బహుమతుల్లో నీ సగం నీకు ఇచ్చేస్తున్నాను. ఇంటికివెళ్లాక లోగడ నాకు రాజుగారిచ్చిన బహుమతులలో కూడా నీ సగం నీకు పంపుతాను. నేను నిన్ను ఇంతగా మోసగించి కష్టపెట్టినందుకు

దయచేసి నన్ను క్షమించు," అంటూజాలి పుట్టేటట్టు పామును వేడుకున్నాడు.

పాము ఇవాన్ చెప్పిన మాటలన్నీ సావధానంగా వింది. "జరిగిపోయిన విషయాల్ని గురించి విచారం ఎందుకులే కాపన్నా! అందులో నీ తప్పేం లేదు. రాజుకి మొదట వచ్చిన కల నీకు జ్ఞాపకం వుందిగా! అప్పుడు రాజ్యమంతా, మోసం, కపటం, ద్రోహంతో నిండివుంది. ఆ సమయంలో నువ్వూ మోసగాడివే అయ్యావు. నన్ను తప్పించుకొని వేరే దారిని ఇల్లు చేరావు. అప్పుడు దేశంలోని మోసగాళ్ళందరిలో నువ్వొకడివి.

"రెండవసారి రాజుకి కల వచ్చినప్పుడు రాజ్యం అంతా యుద్ధాలతోను, కొట్లాటలతోను, హత్యలతోనూ నిండి ఉంది. ఎక్కడ చూసినా క్రూరకృత్యాలు జరుగుతూండేవి. అప్పుడు వారితోపాటు నువ్వూ క్రూరుడవై అనవసరంగా నా తోకను నరికి పారిపోయావు.

"ఇక, ఇప్పుడు దేశమంతా శాంతంగా ఉంది కాబట్టి, నువ్వూ అందరిలాగే న్యాయంగాను, ఉదారంగాను అనుకున్న ప్రకారం నీకు దొరికిన బహుమానాలను నాకు పంచిఇవ్వాలని వచ్చావు. అంతే! మంచిది. ఇక పోయిరా కాపన్నా! భగవంతుడు నీకు శాంతిని, శుభాన్ని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను. నీకు లభించిన బహుమతులు నాకు అక్కర లేదు. నువ్వే తీసుకు వెళ్లు!" అంటూ పాము, దాని దోవన అది పుట్టలోకి వెళ్లి పోయింది.

---

సోవియట్ యూనియన్ కథ

---